క్లుప్తంగా

తొలి తిరుపతికి భక్తుల తాకిడి



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతిలోని శృంగార వల్లభ స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వందల సంఖ్యలో భక్తులు రావడంతో స్వామి సన్నిధికి చేరడానికి గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు భక్తులకు ఆశీర్వచనాలు, తీర్థ, ప్రసాదాలు ఇచ్చారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజే సుమారు 2.85,136 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గురుపూర్ణిమ ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిర్డి సాయిబాబా ఆలయంలో శనివారం గురుపూర్ణిమ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ముఖ్య సలహాదారు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్ దవులూరి పార్వతి పూజలను ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ డి.అప్పారావు, ఆంధ్రా సాయి గీతా సమాజం ప్రతినిధి కొప్పన రాంబాబులు సేవలందంచారు.

ఆర్థిక సాయం చేయండి



చికిత్స పొందుతున్న వలంటీర్ సతీష్

కొత్తపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే గ్రామ వలంటీర్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధ పడుతూ దాతల నుంచి ఆర్థిక సాయం కోరుతున్నాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడు గ్రామానికి చెందిన కుక్కిరి సతీష్ గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రమాదవశాత్తూ ఇంటి వద్ద జారిపడి పోవడంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. సతీష్‌కు తలలో రక్తం గడ్డ కట్టిందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ చేయించే సొమ్ము తమ వద్ద లేదని దాతలు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలంటూ సతీష్ తల్లి లక్ష్మి కోరుతోంది. ఇప్పటికే సచివాలయ సిబ్బంది, పలువురు వలంటీర్లు ఆర్థిక సాయం అందించారు.

గుర్తు తెలియని మృతదేహం



కాకినాడ కెనాల్ రోడ్డులో ఉన్న మృతదేహం

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో వీకే రాయపురం-మాధవపట్నం మధ్యలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రోడ్డు మార్జిన్‌లో పడి ఉన్న మృతదేహంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతదేహంపై తెలుపు రంగు గళ్ల చొక్కా, నీలం, ఎరుపు లుంగీ ధరించి ఉన్నాయని, కుడి చేతికి ఎరుపు రంగు కాసి దారం, ఎరుపు రంగు మొలతాడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలకు సీఐ కె.దుర్గాప్రసాద్ 94407 96568, ఎస్సై 97016 26505లను సంప్రదించాలన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు శివారులో పేక ఆడుతున్న శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకుని, వారి నుంచి రూ.7,630, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వేట్లపాలెంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపు లోనికి తీసుకొని వారి నుంచి రూ.12,270, పేక ముక్కలను స్వాధీం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిపారు.

పథకాలు వర్తింపజేయాలి

సామర్లకోట: భవన నిర్మాణ కార్మికులకు ఇతర రాష్ట్రాలలో అందజేస్తున్నట్టు పథకాలు వర్తింపచేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు అన్నారు. పథకాలను అమలు చేయాలని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమంలో భాగంగా చినరాజప్ప ఇంటి వద్ద ధర్నా చేసి వినతిపత్రాన్ని అందజేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు చింతల సత్యనారాయణ, సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పలు గ్రామాల్లో జగనన్న సురక్ష పారంభం



చిత్రాడలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జేసీ ఇలక్కియా

కొత్తపల్లి: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్తపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఏ కారణం చేతనైనా అందకపోతే అర్హులైన వారిని గుర్తించి ఈ కార్యక్రమం ద్వారా పథకాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. ప్రస్తుతం గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటికే పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలు జగనన్న సురక్షా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమానికి అర్హతే ప్రామాణికమన్నారు. ధృవీకరణ పత్రాలకు లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేదన్నారు. సోమవారం ఉప్పాడ -1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గవర భవాని, ఎంపీపీ కారే సుధ, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, మండల ప్రత్యేకాధికారి పుష్పమణి, ఎంపీడీఓ అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

పిఠాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మండలం చిత్రాడ, గొల్లప్రోలు నగర పంచాయతీలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షమమే పరమావధిగా పని చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. ఇంకా మిగిలిపోయిన ఒక శాతం మందికి వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందడం లేదని, వారికి పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. లబ్ధిదారులకు అవసరమైన జనన, మరణ, నివాస, భూమి హక్కు పత్రాలు తదితర అన్ని రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో తొలిరోజు సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను అందజేశామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జేసీ ఇలక్కియా మాట్లాడుతూ ఏ కారణం చేతనైనా అర్హత ఉండి సర్టిఫికెట్ రాని వారికి ఇది మంచి అవకాశం అన్నారు. అటువంటి వారిని ఇప్పటికే అధికారులు గుర్తించారని, వారికి అర్హత ఉంటే కచ్చితంగా సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ఇప్పటివరకూ ఏవ్వరూ చేయని విధంగా ప్రస్తుత ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ప్రత్యేకాధికారులు, నగర పంచాయతీ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజల కోసమే జగనన్న సురక్ష : ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ప్రజల అవసరాలు గుర్తించి వాటిని సత్వరం పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని ఆర్డీఓ జేఎస్ రామారావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయ శాంతి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలో 1వ సచివాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌తో కలసి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరావు, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, ఆకుల కృష్ణ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

అలాగే మండలంలోని తాటిపర్తి గ్రామంలో జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా జగనన్న సురక్షను ప్రారంభించారు. సర్పంచ్ గోపు సూర్య క్రాంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అందిస్తున్న ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి తదితరులు పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఈఓ పీఆర్డీ మూర్తి పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు



తాటిపర్తిలో కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

సమస్యలు లేని వార్డులు లక్ష్యం కావాలి



సామర్లకోటలో దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందజేసిన చైర్‌పర్సన్, అసిస్టెంట్ కలెక్టర్ తదితరులు

సామర్లకోట: ప్రతి వార్డులో ప్రజల సమస్యలు గుర్తించి, పరిష్కరించి సమస్యలు లేని వార్డులను తయారు చేయాలని సచివాలయ సిబ్బందికి అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధి పెన్షన్‌లైన్ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను సచివాలయాలల్లో ఉచితంగా ఇచ్చి, అర్హులకు నవరత్న పథకాలు అందిస్తారని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలను జీవితకాలం ఉపయోగించుకోవాలని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, కౌన్సిలర్లు పెండ్యాల వెంకటలక్ష్మీ, మర్రి శేషారావు, పాగా సురేష్‌కుమార్, గుబ్బల సత్యనారాయణ, చిట్టుమాని రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఉండూరులో 146 మందికి సర్టిఫికెట్లు

సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలో 146 మందికి 11 రకాల సర్వీసు సర్టిఫికేట్లు అందజేసినట్లు తహసీల్దార్ ఎస్ఎల్వీ కుమారి తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ కార్యదర్శులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం



డాక్టర్లను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్‌లో వైద్యుల దినోత్సవాన్ని క్లబ్ ఉప గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు చాగంటి సన్యాసిరాజు, సాయిలక్ష్మి, వల్లి, మహోన్నత్‌లను సత్కరించారు. క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ, కార్యదర్శి వై.సాయిప్రసాద్, కోశాధికారి బడుగు బాబి పాల్గొన్నారు.



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టరు ప్రత్యూష

మెడికవర్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు

సామర్లకోట: డాక్టర్స్ డేను పురస్కరించుకుని అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం దంత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. స్థానిక భాష్యం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరు బి.ప్రత్యూష దంతాల ప్రాధాన్యాన్ని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సూర్యారావు, బి.శిరీష పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన బొప్పరాజు బృందం

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు శనివారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి పి.దామోదర్, రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, రాష్ట్ర కో చైర్మన్ సంసాని శ్రీనివాసరావు, రాష్ట్ర క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, రాష్ట్ర వీర్వోల సంఘం జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు కలెక్టర్‌తో పాటు జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో 92 రోజులుగా వివిధ సమస్యల సాధనకు చేసిన ఉద్యమ కార్యాచరణకు అనుగుణంగా సాధించిన విజయాలను కలెక్టర్ కృతికా శుక్లాకు బొప్పరాజు వివరించారు. ఆదివారం ఉదయం స్థానిక రెవెన్యూ భవన్‌లో జరిగే విజయోత్సవ సభకు హాజరయ్యేందుకు ఇక్కడకు వచ్చిన సందర్భంగా జిల్లా అధికారులను కలిసినట్లు ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పితాని త్రినాధరావు శనివారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

పెద్దాపురం: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సరస్వతి అన్నారు. జిల్లా న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కోర్టు కాంప్లెక్స్‌లో పారా లీగల్ వలంటీర్ల రెండవ రోజు శిక్షణ సదస్సును ఆమె ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సదస్సులో మహిళా, బాలికా, కార్మిక చట్టాలపై వలంటీర్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు కందుల వెంకటాచలం, ఎం.రాంబాబు, ఎస్. విశాలక్ష్మి, కేవీ చలం, ఎస్.దుర్గారావు, పలు సూచనలు, సలహాలిచ్చారు.

చీలిక పెదాలకు శస్త్రచికిత్సలు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో శనివారం నుంచి చీలిక పెదాలకు శస్త్రచికిత్సలు ప్రారంభమయ్యాయి. డైస్ ఆధ్వర్యంలో 90 మంది బాధిత చిన్నారుల పేర్లను తల్లిదండ్రులు నమోదు చేయించారు. వీరందరికీ ముత్తూట్ ఫిన్ కార్ప్, జీజీహెచ్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు జరగనున్నాయి. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి జీజీహెచ్‌లోని సర్జరీ సెమినార్ హాల్లో శస్త్రచికిత్సలను ప్రారంభించి ముత్తూట్ ఫిన్ కార్ప్ ప్రతినిధులను కొనియాడారు. ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రత్న భూషణ్ పర్యవేక్షణలో చికిత్సలు చేయనున్నారు. ముత్తూట్ ఫిన్ కార్ప్ ప్రతినిధులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ల డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి, జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్



ఉప్పాడలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్ జ్యోతిర్మయి, సచివాలయ కన్వీనర్ రాంబాబు



సామర్లకోటలో వనశెట్టి చంద్రరావుకు పింఛను అందజేసిన వలంటీర్ శృతి

కొత్తపల్లి: మండల వ్యాప్యంగా శనివారం తొలిరోజు 75.03 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 12499 మంది పింఛనుదారులు ఉండగా తొలిరోజు 9378 మందికి పింఛన్లు అందజేశారు. నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ తెలిపారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేకువ జామునే పింఛన్ల పంపిణీ

సామర్లకోట: సామాజిక పింఛన్లను వలంటీర్లు వేకువ జామునే అంద జేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కలసి పట్టణ, మండల పరిధిలోని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, వంటరి మహిలకు 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారని అధికారులు తెలిపారు.



అనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛను అందజేసిన వలంటీర్

అనపర్తి వెళ్లి పింఛన్ అందజేత

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేటకు చెందిన స్వర్ణ మంగ అనారోగ్యానికి గురి కావడంతో అనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు సూచనల మేరకు ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో వలంటీరు కడారి శ్యామ్ సుందర్‌రావు అనపర్తి వెళ్లి శనివారం సాయంత్రం పింఛను అందజేశారు.

ఆర్బీకేలు రైతు నేస్తాలు

- నాలుగేళ్లుగా విశేష సేవలు
- సొంత గ్రామాల్లోనే అన్నీ లభ్యం
- విత్తనం నుంచి విక్రయం దాకా ప్రతి దశలో అన్నదాతకు ఆసరా



ఆర్బీకేల్లో రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్న అధికారులు

పెద్దాపురం: ఒకప్పుడు రైతులన్నా, వారి కష్టాలన్నా ఎవరికీ పట్టేది కాదు. ఏ సమయంలో ఏ పంట వేయాలి, ఏ రకం విత్తనాలు, భూసార పరీక్షలు, ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికలు తదితర సమాచారం అందుబాటులో లేక అయోమయంలో ఉండే పరిస్థితి ఆనాటి అన్నదాతది. నేటి పరిస్థితి అందుకు విభిన్నం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతకు అండగా నిలబడ్డారు. విత్తనం నుంచి విక్రయం వరకు ప్రతి దశలో ఎప్పుడు ఏ అవసరమైన సమాచారం కావాలన్నా నేనున్నానంటూ నిలబడే రైతు భరోసా కేంద్రాలను (ఆర్బీకే)లు ఏర్పాటుచేశారు. ఇవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా మారాయి.

అన్ని రకాల సేవలు

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం సొంత ఊరిలోని ఆర్బీకేలనే రైతులు ఆశ్రయించి సమగ్ర సమాచారం పొందుతున్నారు.

కియోస్క్‌తో ఎన్నో ప్రయోజనాలు

ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా సబ్సిడీ ఎరువుల, విత్తనాలను 48 గంటల్లోనే రైతులకు అందజేస్తున్నారు. సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ప్రసుత్తం వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లు, గడ్డికోత యంత్రాలను పంపిణీ చేస్తున్నారు.

ఈ క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారం

ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుఫానుల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందే అవకాశం ఉంది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందజేస్తున్నాయి.

మండలంలో ఆర్బీకేల సేవలు ఇలా...

మండలంలోని ఆర్బీకేలు 23
మొత్తం రైతులు 11,264
రైతు భరోసా పొందిన రైతులు 8482
నాలుగేళ్లలో పొందిన లబ్ధి రూ.45.8 కోట్లు
ఎరువులు, విత్తనాలు అందుకున్నవారు: 7122
వ్యవసాయ పనిముట్లు.
యంత్రాలు పొందిన రైతులు :156
ఉద్యాన పంటపై సబ్సిడీ పొందినవారు 320
వారికి కలిగిన లబ్ధి రూ.29.36 లక్షలు

ఈ క్రాప్ బుకింగ్‌తో ఎంతో మేలు



ఆర్బీకే సిబ్బంది ఖరీఫ్, రబీ సీజన్లో చేపట్టే ఈ క్రాప్ బుకింగ్ మాకెంతో ఉపయోగం. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పంటల బీమా పథకం కింద నష్ట పరిహారం ఇస్తున్నారు. రైతుల కోసం కష్టపడుతున్న సీఎంకు రుణపడి ఉంటాం.

– పెనుమర్తి బలరామ కృష్ణార్జున చౌదరి, రైతు, ఆర్బీ పట్నం, పెద్దాపురం మండలం

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ఆర్బీకేల్లో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతోంది. సీజన్లతో సంబంధం లేకుండా అన్నీ దొరుకుతున్నాయి. మార్కెట్ ధర కంటే ఆర్బీకేలో ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకే దొరుతున్నాయి.

– సుందరెడ్డి రాజు, కౌలురైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

రైతులకు మరిన్ని సేవలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరిన్ని సేవలందిస్తున్నాం. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సీజన్లలోనూ సేవలందిస్తున్నాం. ఆర్బీకే సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి

– సంజయ్‌కుమార్, ఏఓ, పెద్దాపురం మండలం

గ్రంథాలయ సంస్థలో పోస్టులు భర్తీ చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న పోస్టులను కోర్టు అదేశాల మేరకు భర్తీ చేయాలని గోదావరి లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. పౌర గ్రంథాలయ శాఖ అనుమతి ఇచ్చిన గ్రేడ్-3 విభాగం 47, కోర్టు పెండింగ్‌లో ఉన్న 11 పోస్టులను భర్తీ చేయడంతో పాటు 2019లో పరీక్ష నిర్వహించిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గ్రామ స్థాయిలో డిజిటల్ గ్రంథాలయాలను నిర్మిస్తున్న ప్రభుత్వం వెంటనే లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేసి 20 ఏళ్లుగా నిరుద్యోగులుగా ఉన్న గ్రంథాలయ కోర్సు చేసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ తనిఖీ

కాకినాడ సిటీ: స్థానిక దుమ్ములపేటలో ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీని జేసీ ఎస్ ఇలక్కియ శనివారం తనిఖీ చేశారు. ఈనెల నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నామని, ప్రతి కార్డు దారుడికి బియ్యంతో పాటు రూ.16లకే కిలో గోధుమ పిండి అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ మరియు విటమిన్లు కలిపి బలవర్ధక పోషకాలుంటాయని జేసీ ఇలక్కియ వివరించారు. ఈ బియ్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రతి ఒక్కరూ వండుకుని తినాలని లబ్ధిదారులకు సూచించారు.